

నడక మంచిదే!

ఏ బరువూ.. బాదరబందీ లేకుండా, జంకూ, సంకోచమూ కనిపించకుండా.. జాతీయ రహదారి మీద నవ్వులు చిందిస్తూ నడిచిపోతున్న ఈ యువతి పేరు గీతా బాలకృష్ణన్. పుట్టింది కోల్‌కత్తాలో. చదువుకున్నది హైదరాబాద్‌లో. జనవరి 7న చెన్నైలో మొదలైన నడక 28న బెంగళూరులో ముగుస్తుంది. 335 కిలోమీటర్ల నడకయాత్ర బంగారుపాళ్యంకు చేరుకున్నపుడు ఆంధ్రజ్యోతి ఆమెను పలకరించింది. ప్రత్యేక ప్రతిభావంతులకు అన్నిచోట్లా ప్రత్యేక వసతులు తప్పనిసరిగా కల్పించాలనే సందేశంతో నడుస్తున్నట్టు ఆమె చెప్పారు. నడక ఆమెకు కొత్త కాదు. 2002లో కోల్‌కత్తా నుంచి ఢిల్లీకి 1700 కిలోమీటర్ల దూరం 170 రోజుల్లో నడిచానని చెప్పారు. గతంలో కోల్‌కత్తా నుంచి బంగ్లాదేశ్ రాజధాని ఢాకా నగరం దాకా 306 కిలోమీటర్లు నడిచానన్నారు. దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం పెంచడం, దివ్యాంగుల ప్రతిభను సమాజం గుర్తించడం, వారికి ప్రత్యేక వసతులు కల్పించేలా అవగాహన కలిగించడం తన నడక ఉద్దేశ్యాలని గీతా బాలకృష్ణన్ వివరించారు. వ్యక్తి ఆరోగ్యానికే కాదు, సమాజంలోని అసమానతలు తొలగేలా అవగాహన కలిగించడానికీ నడక ఉపయోగపడుతుందని ఆమె నిరూపిస్తున్నారు.

- బంగారుపాళ్యం

పోటెత్తిన పులిగుండు

పెనుమూరు మండలం పులిగుండం వద్ద బుధవారం జరిగిన తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. సంక్రాంతి పండుగ చివరి రోజున తిరునాళ్ల నిర్వహించడం ఆనవాయితీ. ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. స్వామి దర్శనం కోసం భక్తులు ఎగబడ్డారు. ఉదయం శేష వాహనంపై పార్వతీపరమేశ్వర్లు గిరిప్రదక్షిణగా బయలుదేరారు. కొత్తరోడ్డు, సీఎస్ అగ్రహారం మీదుగా కొండచుట్టుగా పులిగుండుకు చేరుకున్నారు. సాయంత్రం పెనుమూరు శివాలయంలోని పార్వతీ పరమేశ్వరులను పులిగుండుకు తీసుకొచ్చాక భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు, దుకాణదారులకు ఆలయ నిర్వాహకుడు షణ్ముగంరెడ్డి ఏర్పాట్లు చేయగా.. భక్తులకు విజయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాత్రి అన్నదానం, కోలాట భజనలు, పాటకచేరి నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ పవన్‌కుమార్, సీఐ గంగిరెడ్డి, ఎస్‌లు రామాంజనేయులు, వెంకటసుబ్బమ్మ, సిబ్బంది భద్రతా చర్యలు చేపట్టారు.

- పెనుమూరు



చిత్తూరు టీడీపీలో
ఐక్యతారాగం



- ఎవరికి టికెట్ వచ్చినా కలిసి పనిచేసేలా ప్రణాళికలు
- ఆశావహులతో సమావేశమైన మాజీ ఎమ్మెల్సీ దొరబాబు
- 21 నుంచి కలిసికట్టుగా ఇంటింటికి టీడీపీ

చిత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక వ్యూహంతో ముందడుగు వేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించుకుంది. వైసీపీ నుంచి విజయానందరెడ్డిని ప్రకటించిన నేపథ్యంలో టీడీపీ అభ్యర్థి ఎంపిక నిర్ణయం పూర్తిగా అధినేతకే వదిలేయాలని అనుకుంటున్నారు. సంక్రాంతి పండుగకు నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబును కలిసిన నియోజకవర్గ సమన్వయకర్త దొరబాబు ఇక్కడి పరిస్థితులను వివరించారు. అభ్యర్థి ఎంపిక విషయంలో తొందరపడరాదని, ఇంకొంత సమయం తీసుకుంటామని,ఈలోగా అందరూ కలిసి పనిచేసి టీడీపీ బలం ఏమిటో చూపించాలని ఆయన దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇందులో భాగంగానే బుధవారం చిత్తూరు టికెట్ ఆశిస్తున్న ఆరుగురిలో నలుగురితో దొరబాబు సమావేశం అయ్యారు. టికెట్ ఎవరికి ప్రకటించినా అందరూ ఐక్యంగానే ఉండి పార్టీ విజయానికి పనిచేయాలని నిర్ణయించుకున్నారు.

ఆరుగురు ఆశావహులు వీళ్లే

చిత్తూరు టీడీపీ టికెట్ ఆశిస్తున్న ఆరుగురు ఆశావహుల్లోని నలుగురితో బుధవారం దొరబాబు పార్టీ కార్యాలయంలో సమావేశమయ్యారు. డీఏ శ్రీనివాస్ తరఫున ఆయన చిన్నాన్న డీకే బద్రినారాయణ హాజరయ్యారు. బుధవారం నాటి మీటింగ్‌కు రాలేకపోయిన చంద్రప్రకాష్‌తో దొరబాబు ఫోనులో మాట్లాడారు. మాజీ మేయర్ హేమలత, జీజేఎం ట్రస్టు ఛైర్మన్ గురజాల జగన్మోహన్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, తిరుచానూరు మాజీ సర్పంచి సీఆర్ రాజన్, జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ ఈ సమావేశానికి హాజరయ్యారు.

విడివిడిగా వద్దు

ప్రస్తుతం చిత్తూరు ఆశావహులు కార్యక్రమాలు విడివిడిగా నిర్వహిస్తున్నారు. ఇక నుంచి పార్టీకి సంబంధించిన ఏ కార్యక్రమంలోనైనా అందరూ కలిసిపాల్గొనాలని తీర్మానించారు. ఆరుగురిలో ఎవరికి టికెట్ వచ్చినా మిగిలినవారు అలగకుండా ఆ ఒక్కరి విజయం కోసం పనిచేయాలని నిర్ణయించారు. ఇక నుంచి ఎవరూ విడిగా కార్యక్రమాలు నిర్వహించకూడదని, విడిగా జిందాబాద్‌లు కొట్టించుకోవద్దని, విడిగా బ్యానర్లను ఏర్పాటు చేసుకోవద్దని నిర్ణయం తీసుకున్నారు. గురువారం జరగబోయే దివంగత ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల నుంచే ఐక్యత చాటాలని తీర్మానించారు. ఈ మేరకు ఆరుగురు ఆశావహులు కలిసి ఈ నెల 21 నుంచి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. చిత్తూరు నగరంలోని 50 డివిజన్లు, గుడిపాల, చిత్తూరు మండలాల్లోని 44 పంచాయతీల్లో 45 రోజుల్లో ఇంటింటికి టీడీపీ కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్ణయించారు.

మిగిలినవారికి సముచిత స్థానం

ఆరుగురు ఆశావహుల్లో టికెట్ వచ్చిన ఒకరి విజయానికి కృషి చేసిన మిగిలిన ఐదుగురికి టీడీపీ అధికారంలోకి వచ్చాక కచ్చితంగా మంచి పదవులు ఇప్పిస్తామని దొరబాబు సూచించారు. చిత్తూరులో జడ్పీ, చుడా, మార్కెట్ కమిటీ, సెంట్రల్ బ్యాంకు ఛైర్మన్, మేయర్ వంటి పదవులు మిగిలినవారికి దక్కుతాయని వారికి హామీ ఇచ్చారు.

2004లోనూ ఇదే సూత్రం

2004లో జరిగిన సాధారణ ఎన్నికలకు ముందు ఇలాగే ఆశావహులు ఎక్కువైపోయారని, ఆశావహులందర్నీ ఏకతాటిపైకి తెచ్చి సత్ఫలితం సాధించామని చిత్తూరు సమన్వయకర్త దొరబాబు అన్నారు. అప్పట్లో ఏఎస్ మనోహర్, కటారి మోహన్, చంద్రప్రకాష్, రావూరి ఈశ్వరరావు తదితర తొమ్మిది మందితో బృందం ఏర్పడి ప్రజల్లోకి వెళ్లారని, ఈసారి ఆరుగురు వెళ్తున్నామని ఆయన చెప్పుకొచ్చారు. 2004లో ఏఎస్ మనోహర్ గెలిచినట్లు ఈసారి కూడా టీడీపీ అభ్యర్థి గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ఎన్నికల బదిలీలు మొదలు

- డీఆర్వోగా దేవేంద్రరెడ్డి నియామకం
- నలుగురు తహసీల్దార్లకు స్థానచలనం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారుల బదిలీలు ప్రారంభమయ్యాయి. జిల్లా రెవెన్యూ అధికారిగా డిప్యూటీ కలెక్టర్ వి.దేవేంద్రరెడ్డిని నియమిస్తూ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కేఎస్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం డీఆర్వోగా ఎస్.రాజశేఖర్ వ్యవహరిస్తున్నారు. త్వరలో సాధారణ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సొంత జిల్లాతో పాటు మూడేళ్లకుపైగా జిల్లాలో తహసీల్దార్ హోదాలో విధులు నిర్వహిస్తున్న నలుగురు తహసీల్దార్లు పొరుగుజిల్లాలకు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీసీఎల్‌ఏ నుంచి మంగళవారం రాత్రి ఉత్తర్వులు వెలువడ్డాయి. దీంతో తొలి విడత ఎన్నికల బదిలీలకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 22న ఓటర్ల తుదిజాబితా విడుదల కానున్న నేపథ్యంలో ఈనెలాఖరుకల్లా మిగిలిన తహసీల్దార్లతో పాటు ఎంపీడీవోలు, జిల్లా అధికారులకు కూడా స్థానచలనం కానుంది. ప్రస్తుతం ఓటరు జాబితా తయారీతో సంబంధం లేకుండా ఇతరత్రా పోస్టుల్లో ఉన్న తహసీల్దార్లను తొలివిడతగా ఇతర జిల్లాకు బదిలీచేశారు. గత ఎన్నికల సమయంలో తహసీల్దార్లను జిల్లాలకు కేటాయిస్తే కలెక్టర్ పోస్టింగ్ ఇచ్చేవారు. ఈసారి నేరుగా మండలాల పోస్టింగ్స్ కూడా సీసీఎల్‌ఏ చేసింది. చిత్తూరు కలెక్టరేట్‌లో ల్యాండ్ రికార్డ్స్ (ఎల్ఆర్) ఏవో కె.పద్మజను కర్నూలు జిల్లా పత్తికొండ తహసీల్దార్‌గా, కలెక్టరేట్ భూవిభాగంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న పి.మురళిని కర్నూలు జిల్లా కోసిగి, చిత్తూరు ఆర్డీవో కార్యాలయంలో డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న బి.రామాంజుల నాయక్‌ను కర్నూలు జిల్లా చిప్పగిరి తహసీల్దారుగా బదిలీ చేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని కేఆర్‌సీసీ తహసీల్దారుగా పనిచేస్తున్న టి.జి.మోహనవల్లిని అనంతపురం జిల్లా యాడికి తహసీల్దారుగా బదిలీచేశారు.

ఓటరు తుది జాబితాను పునఃపరిశీలించండి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: ఓటరు తుదిజాబితాను ఈనెల 22న ప్రచురితం చేయడానికి ముందు ఆ జాబితాను పునఃపరిశీలించి తప్పులుంటే సరిదిద్దాలని జిల్లా ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ సూచించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో ప్రత్యేక ఓటర్ల సవరణపై ఆయన ఎన్నికల అధికారులతో సమీక్షించారు. అందిన ఫిర్యాదులపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులకు సంబంధించి ఓటర్లకు నోటీసులు ఇవ్వాలని, ఫారం -6, 7, 8కి సంబంధించిన రికార్డులన్నింటినీ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. పరిశీలన అనంతరం నిర్ధారించుకున్న తర్వాత తుది ఓటరు జాబితా ముద్రణ చేపట్టాలని స్పష్టంచేశారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల తుది ఓటరు జాబితాల విషయంలో అన్ని చర్యలు చేపట్టామని కలెక్టర్ షన్మోహన్ వివరించారు. ఈనెల 22న మీడియా సమావేశం ఏర్పాటు చేసి జాబితా విడుదల చేస్తామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో రాజశేఖర్, ఆర్డీవోలు, ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్, లక్ష్మీప్రసన్న, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎన్నికల అధికారులతో సమీక్షిస్తున్న రోల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

టీడీపీ బ్యానర్లే
టార్గెట్



టీడీపీ బ్యానర్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

- దగ్గరుండి తొలగించిన మున్సిపల్ అధికారులు
- ఎప్పటి నుంచే ఉన్న వైసీపీ ఫ్లెక్సీలను పట్టించుకోని వైనం

చిత్తూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో తెలుగుదేశం పార్టీ ఫ్లెక్సీలను అధికార పార్టీ పరోక్షంగా టార్గెట్ చేసింది. కార్పొరేషన్ అధికారుల ద్వారా బుధవారం వీటిని తొలగించే చర్యలు చేపట్టింది. ఇటీవల టీడీపీ నాయకులు చేపట్టిన కార్యక్రమాలకు ప్రజల నుంచీ విశేష స్పందన లభించింది. దీంతో అధికార పార్టీకి చెందిన ఓ నేత అసహనం వ్యక్తంచేసి.. టీడీపీ ఫ్లెక్సీలను తొలగించాలని హుకుం జారీ చేసినట్లు సమాచారం. దీంతో మున్సిపల్ అధికారులు వైసీపీ ఫ్లెక్సీల జోలికి వెళ్లకుండా టీడీపీ నేతలవి తొలగించారు. కొన్నింటిని వెనక్కి తిప్పి పెట్టారు. కానీ, గాంధీ సర్కిల్, కొంగారెడ్డిపల్లె, ఆసుపత్రి వంటి ప్రాంతాల్లో నెలల తరబడి పెద్దఎత్తున ఉన్న వైసీపీ నాయకుల ఫ్లెక్సీల జోలికి వెళ్లకపోవడం విమర్శలకు తావిస్తోంది. సాధారణంగా బ్యానర్లు, ఫ్లెక్సీల ఏర్పాటుకు మున్సిపాలిటీలో ముందుగా చలానా కట్టి అనుమతి తీసుకోవాలి. జిల్లా పార్టీ కార్యాలయంలో జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గీర్వాణీ చంద్రప్రకాష్ వేడుకలు నిర్వహించినప్పుడు, టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్ పుట్టినరోజు కార్యక్రమాలకూ చలానా కట్టారు. ఇటీవల గురజాల జగన్మోహన్ కూడా చలానా కట్టి పెద్దఎత్తున బ్యానర్లను ఏర్పాటు చేశారు. 50 వేల కుటుంబాలకు చేపట్టిన సంక్రాంతి కానుకల పంపిణీకి విశేష స్పందన వచ్చింది. ఇది ఓ వైసీపీ నేతకు ఇబ్బంది కలిగినట్లు తెలుస్తోంది. ఆయన ఆదేశాలతో గురజాల జగన్‌తో పాటు చంద్రప్రకాశ్, సీఆర్ రాజన్‌కు చెందిన ఫ్లెక్సీలను తొలగించడం నగరంలో చర్చనీయాంశంగా మారింది. కాగా, చలానా కట్టిన గడువు పూర్తి కావడంతో బ్యానర్లను తొలగిస్తున్నామని కమిషనరు అరుణ చెప్పారు. అయితే, మరోసారి తాము రెన్యువల్ చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదని గురజాల జగన్మోహన్ అంటున్నారు.



గాంధీ సర్కిల్ ఎదురుగా ఉన్న వైసీపీ నాయకుల ఫ్లెక్సీలు

ఎన్టీఆర్ వర్ధంతికీ తొలుత అనుమతి నిరాకరణ

వైసీపీ చేపట్టిన సామాజిక సాధికార బస్సు యాత్రకు నగరంలో ట్రాఫిక్‌ను మళ్లించి ఎంఎస్ఆర్ సర్కిల్‌ను బ్లాక్ చేసిన పోలీసులు.. అంతకుముందు జరిగిన లోకేశ్ యువగళం పాదయాత్రకు ఆంక్షల పేరుతో అడ్డంకులు సృష్టించిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం చిత్తూరులో ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమాల నిర్వహణకు తొలుత పోలీసులు అనుమతివ్వలేదు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నిర్వహించుకుంటామని, అనుమతి ఇవ్వాల్సిందేనంటూ టీడీపీ నేతలు భీష్మించడంతో ఆంక్షలతో కూడిన అనుమతి ఇచ్చారు. దీంతో ఎన్టీఆర్ సర్కిల్ సమీపం, పీసీఆర్ కాలేజ్ వద్ద అన్నదానానికి టీడీపీ నాయకులు ఏర్పాట్లు చేసుకున్నారు.



కొంగారెడ్డిపల్లెలో టీడీపీ బ్యానర్లు కనిపించకుండా వెనక్కి తిప్పేశారిలా..

వేడుకగా కొండచుట్టు



మండపం వద్ద సందడి

నగరి, జనవరి 17: నగరి పట్టణంలోని మండపం వద్ద బుధవారం కొండచుట్టును వైభవంగా నిర్వహించారు. కనుమ మరుసటి రోజు ముక్కనుమ రోజున ఈ కొండచుట్టు నిర్వహించడం ఆనవాయితీ. నారాయణవనం నుంచి అన్ని గ్రామాలను చుట్టుకుని నగరికి వచ్చి.. పుత్తూరు మీదుగా తిరిగి నారాయణవణంకు కొండలన్నీ చుట్టుకుని వెళ్లడంతో కొండచుట్టు అనే పేరు వచ్చింది. ఈ నగరి కొండచుట్టులో ఒకే చోట 19 నుంచి 23 దేవతలను దర్శించుకోవచ్చు. కొండచుట్టులో భాగంగా బుధవారం 23 గ్రామాల నుంచి గ్రామదేవతలను స్థానికులు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చిన్నారులు, యువత కేరింతలు.. పెద్దల పూజల నడుమ కొండచుట్టు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మండపం వద్ద దేవతామూర్తులను భక్తులతో పాటు మంత్రి రోజా, నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, వైకాపా రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నేత కేజే కుమార్ తదితరులు దర్శించుకున్నారు.



వివిధ గ్రామాలనుంచి వచ్చిన దేవతా మూర్తులు

ఆర్థిక లావాదేవీలు, దాడులపై కేసుల నమోదు

పలమనేరు, జనవరి17: 'కాఫీలో మత్తుమందు ఇచ్చి తనను నగ్నంగా ఉంచి, ఆపై మరో యువకుడిని తనపక్కన పడుకోపెట్టి ఫొటోలు తీసి అభిలాష అనే మహిళ తనను బ్లాక్ మెయిల్ చేస్తోంది' అని బాధితురాలు పలమనేరు పోలీసులకు ఈనెల 16వ తేది ఫిర్యాదు చేసింది. ఇద్దరు మహిళల మధ్య జరిగిన డబ్బు లావాదేవీలు చివరకు దాడులకు దారి తీసిన ఘటనపై పలమనేరు పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పలమనేరు అయ్యాకొణ్ణవీధిలో కాపురముంటున్న అభిలాష వస్త్రవ్యాపారం చేస్తూ పట్టణ సమీపంలోని ఓ గ్రామానికి చెందిన మహిళకు రూ. 15 లక్షలు వేరేవారి వద్ద అప్పుగా తీసి ఇచ్చింది. ఈ మొత్తం వసూలు చేసే సందర్భంగా ఆ మహిళ ఈనెల 15 వతేది కొంత మందితో వచ్చి అభిలాషపై దాడిచేసింది. దీనిపై అభిలాష పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ మహిళతో పాటు మరికొందరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదేవిధంగా ఆ మహిళ కూడా పోలీసులకు ఫిర్యాదు చేస్తూ.. తాను చీరల వ్యాపారం చేస్తున్న అభిలాష ఇంటికి ఏడాది క్రితం వెళ్లినప్పుడు కాఫీలో మత్తుమందు ఇచ్చితనను నగ్నంగా ఫొటోలు తీసి బ్లాక్ మెయిల్ చేస్తోందని పేర్కొన్నారు. ఈమె ఫిర్యాదు మేరకు అభిలాష, గణేష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరువురి ఫిర్యాదు మేరకు పలమనేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు. ఈ కేసులో ఎవరు చెబుతున్నది వాస్తవమో పోలీసుల దర్యాప్తులో తేలనుంది.

పంటలపై కొనసాగిన గజదాడులు




కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు - గుడిసెను కూల్చివేసిన ఏనుగులు

కల్లూరు, జనవరి 17: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీలోని పంటలపై మంగళవారం రాత్రి ఏనుగుల గుంపు దాడులు చేయడంతో మామిడి, కొబ్బరి, అరటి తదితర పంటలకు అపారనష్టం వాటిల్లింది. కోటపల్లెకు చెందిన రైతు నరేష్ పొలంలోని కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి. మామిడిచెట్లు, అరటిపంటను ధ్వంసం చేశాయి. పొలం వద్ద గుడిసెను నేలమట్టం చేశాయి. జూపల్లెకు చెందిన సుబ్బరత్న పొలంలోని మామిడి, కొబ్బరి చెట్లను ధ్వంసం చేశాయి. జూపల్లెకు చెందిన మునస్వామి, రవి తదితర రైతుల భూముల్లో సంచరించిన ఏనుగుల గుంపు మామిడిచెట్లను, బోరు మోటారును ధ్వంసం చేశాయి.

ఒంటరి ఏనుగు స్వైర విహారం

సోమల: సోమల మండలం చిన్నఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని పొలాల్లో మంగళవారం రాత్రి ఒంటరి ఏనుగు సంచరించి పలు పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. గట్టువారిపల్లెకు చెందిన మునిరాజు, సోమశేఖర్ చెరుకు తోట, నాగమ్మకు చెందిన డ్రిప్ పరికరాలను ధ్వంసం చేసింది. రైతులు నరసింహులు, సీతారాంలకు చెందిన కొబ్బరి, అరటి చెట్లలో తిరగాడి నష్టపరిచినట్లు వాపోయారు. పంటలను తొక్కివేసి టమోటాలకు ఊతంగా నాటిన కర్రలను నాశనం చేశాయి.



గట్టువారిపల్లె సమీపంలో ఏనుగుల దాడితో ధ్వంసమైన పంటలు

స్థానిక సంస్థలకు రూ.19.07 కోట్లు

● 15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: స్థానిక సంస్థలకు కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. జిల్లా పరిషత్తుకు రూ.5,26,39,470, మండల పరిషత్తులకు రూ.2,29,63,741, గ్రామ పంచాయతీలకు రూ.11,52,29,049 విడుదలయ్యాయి. పంచాయతీల్లో మండలాలవారీగా బైరెడ్డిపల్లెకు రూ.46.94 లక్షలు, బంగారుపాళ్యంకు రూ.57.19 లక్షలు, చిత్తూరుకు రూ.22.64 లక్షలు, చౌడేపల్లెకి రూ.33.39 లక్షలు, గంగాధరనెల్లూరుకు రూ.54.17 లక్షలు, గంగవరానికి రూ.43.97లక్షలు, గుడిపాలకు రూ.32.63 లక్షలు, గుడుపల్లెకు రూ.37.79లక్షలు, ఐరాలకు రూ.39.63 లక్షలు, కార్వేటినగరానికి రూ.36.74 లక్షలు, కుప్పానికి రూ.53.91 లక్షలు, నగరికి రూ.24.28 లక్షలు, నింద్రకు రూ.22.84 లక్షలు, పలమనేరుకు రూ.23.33లక్షలు, పాలసముద్రంకు రూ.19.11లక్షలు, పెద్దపంజాణికి రూ.48.17లక్షలు, పెనుమూరుకు రూ.27.16 లక్షలు, పులిచెర్లకు రూ.29.16 లక్షలు, పుంగనూరుకు రూ.45.08 లక్షలు, పూతలపట్టుకు రూ.35.68, రామకుప్పంకు రూ.44.46 లక్షలు, రొంపిచెర్లకు రూ.16.89 లక్షలు, శ్రీరంగరాజపురానికి రూ.30.50 లక్షలు, శాంతిపురంకు రూ.48.18 లక్షలు, సదుంకు రూ.35.36 లక్షలు, సోమలకు రూ.35.75 లక్షలు, తవణంపల్లికి రూ.42.64 వి.కోటకు రూ.68.04 లక్షలు, వెదురుకుప్పానికి రూ.37.93 లక్షలు, విజయపురానికి రూ.24.11 లక్షలు, యాదమరికి రూ.36.46 లక్షలను ఆయా ఖాతాలకు జమచేశారు.

మామిడి సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టండి

చిత్తూరు (సెంట్రల్), జనవరి 17: మామిడి పూత దశలో ఉన్న కారణంగా రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్‌రెడ్డి బుధవారం సూచించారు. సస్య రక్షణ చర్యలతోనే నిర్ణీత మోతాదులో మందులు పిచికారి చేయడం ద్వారా తేనె మంచు, తామర వంటి చీడపీడలు, తెగుళ్ల నుంచి మామిడిని కాపాడుకోవచ్చన్నారు.

108లో కాన్పు

ఆడబిడ్డకు జన్మనిచ్చిన తల్లి

గుడిపాల, జనవరి 17: గుడిపాల మండలం చిత్తపార గ్రామానికి చెందిన రాజశేఖర్ భార్య సుజాత మంగళవారం అర్ధరాత్రి పురిటినొప్పులు రావడంతో వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, స్పందిన 108 అంబులెన్స్ సమయానికి చేరుకుని చిత్తూరు ఆస్పత్రికి తీసుకెళ్తుండగా, మార్గమధ్యంలో అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శివకుమార్ అత్యవసర వైద్యం అందించగా, సుజాత అంబులెన్స్‌లోనే పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీ బిడ్డ సురక్షితంగా వున్నారని టెక్నీషియన్ శివకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



108లో ప్రసవించిన సుజాత

కాజేసిన సర్పంచుల నిధులను ఇప్పించండి

తిరుపతి(కొర్లగుంట), జనవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం కాజేసిన రూ.9,229 కోట్ల సర్పంచుల నిధులను ఇప్పించాలని కేంద్ర మంత్రి కపిల్ మోరేశ్వర్‌పాటిల్‌కు పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగంశెట్టి సుబ్బరామయ్య వినతి పత్రం సమర్పించారు. బుధవారం రాత్రి కేంద్ర మంత్రి శ్రీవారి దర్శనార్థం వచ్చిన సందర్భంగా నంది కూడలి వద్ద బీజేపీ నేత గుండాల గోపినాథ్ రెడ్డితో కలిసి ఆయన స్వాగతం పలికి, సత్కరించారు. సుబ్బరామయ్య మాట్లాడుతూ నిధుల దారి మళ్లింపు నేపథ్యంలో గతేడాది ఆగస్టు 2న ఢిల్లీలో కలిశామని, ఇంతవరకు ఎలాంటి స్పందనా లేదని తెలిపారు. తాజాగా నాలుగు రోజుల క్రితం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన రూ.985కోట్ల నిధుల్లోనూ రూ. 600కోట్లు నిలుపుదల చేసినట్లు వివరించారు. తమ నిధులు ఎలాగైనా ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ధనంజయయాదవ్, మురళి, కిరణ్‌యాదవ్, రమేష్‌నాయుడు, మునిరాజ తదితరులు పాల్గొన్నారు.



కేంద్రమంత్రికి వినతిపత్రం సమర్పిస్తున్న సుబ్బరామయ్య

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.46 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 73,016 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 20,915 మంది తలనీలాలు సమర్పించారు.




బ్రాహ్మణపల్లె జల్లికట్టులో పశువులను నిలువరిస్తున్న యువకులు - అల్లిలో వదలడానికి గిత్తను తీసుకెళుతున్న యువకులు

కోలాహలంగా జల్లికట్టు

● బ్రాహ్మణపల్లెలో ఎటు చూసినా జనమే

వెదురుకుప్పం, జనవరి 17: ముక్కనుమ సందర్భంగా బుధవారం వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లె, కురివికుప్పం గ్రామాల్లో జల్లికట్టు నిర్వహించారు. బ్రాహ్మణపల్లె జల్లికట్టుకు వేలాదిగా జనం తరలి రావడంతో గ్రామం.. జనసంద్రంగా మారింది. ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు పశువులను బ్రాహ్మణపల్లెకు తీసుకొచ్చారు. ఆయా గిత్తల కొమ్ములకు బహుమతులుగా ఉపయోగించే పట్టీలను కట్టారు. కొన్నింటికి వస్త్రాలను కప్పి వదిలారు. కొందరు ప్రధాన పార్టీల జెండాలనూ కట్టారు. ఇలా.. అల్లిలో వదిలిన పశువులను ఆపేందుకు యువకులు ప్రయత్నించారు. జనసమూహాన్ని చీల్చుకుంటూ గిత్తలు ముందుకు దూసుకు వెళ్లడంతో వాటిని ఆపే ప్రయత్నంలో యువకులు వాటి కింద పడి కొందరు గాయపడ్డారు. పట్టీలను సొంతం చేసుకునే క్రమంలో గిత్తలతో కుస్తీ పడ్డారు. కొందరు యువకులు పట్టీలను సొంతం చేసుకోగా.. మరి కొన్ని గిత్తలు వీరికి దొరకలేదు.



ఎద్దులను నిలువరిస్తున్న యువకులు

ఎర్రమట్టిపల్లిలో..

పెనుమూరు: పెనుమూరు మండలం ఎర్రమట్టిపల్లిలో బుధవారం జల్లికట్టు నిర్వహించారు. వీధుల్లో పశువులను పరిగెత్తించారు. వాటిని నిలువరించేందుకు యువకులు పోటీపడ్డారు. ఈ జల్లికట్టును తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున గ్రామానికి తరలివచ్చారు.

కురివికుప్పంలో..

కురివికుప్పంలోనూ జల్లికట్టు నిర్వహించారు. అల్లిలో వదిలిని కోడెగిత్తలను నిలువరించి, బహుమతులను చేజిక్కించుకునేందుకు యువకులు ప్రయత్నించారు. ఈ క్రమంలో పలువురు గాయిపడ్డారు. ఎగువ పాతగుంటకు చెందిన 55 ఏళ్ల వ్యక్తిని గిత్త పొడవడంతో అస్వస్థతకు గురైనట్లు స్థానికులు తెలిపారు. ఆయన అపస్మారక స్థితికి చేరుకోగా.. చికిత్స నిమిత్తం తిరుపతికి బంధువులు తరలించారు. పట్టీలు దక్కించుకున్న యువకులు సంతోషంగా వెనుతిరిగారు.




కురివికుప్పం జల్లికట్టులో పశువులను పట్టేసిన యువకులు

హైవే విస్తరణకు బ్లాస్టింగ్

● రాయిపడి బిహారు యువకుడి దుర్మరణం

● పేలుళ్లలో జాగ్రత్తగా ఉండటంలేదంటూ స్థానికుల విమర్శ




మృతిచెందిన బిహార్ యువకుడు - అరుళ్‌పురం, మోపతికన్నికాపురం వద్ద రాయిని పేల్చిన ప్రదేశం

గుడిపాల, జనవరి 17: జాతీయ రహదారి విస్తరణ పనుల్లో భాగంగా కొండను పేల్చడానికి అధికారులు పేల్చారు. ఈ పేలుడు ధాటికి రాళ్లు వచ్చి పైన పడ్డటంతో బిహారుకు చెందిన యువకుడు మృతిచెందారు. గుడిపాల మండలంలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు- వేలూరు, వేలూరు- చిత్తూరు జాతీయ రహదారిలోని మోపతికన్నికాపురం, అరుళ్‌పురం సమీపంలో ఆరులేన్ల రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా గుట్టను చదునుచేసే ప్రయత్నంలో రాళ్లు పేల్చడానికి బ్లాస్టింగ్ చేశారు. ఈ పేలుడు తీవ్రతకు రాళ్లు ఎగిరి వచ్చి.. రోడ్డుపై అటుగా ఎవరైనా వస్తే ఆపేందుకు ఉన్న బిహారుకు చెందిన కూలీ మొహమ్మద్ ఇర్షాద్ రాజా (23)పై పడ్డాయి. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందారు. పేలుడు పదార్థాలను పెట్టే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడంలో హైవే అధికారులు, కాంట్రాక్టరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. మృతదేహాన్ని తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

● కాగా, వారం రోజుల కిందట వసంతాపురం పంచాయతీ పశుమంద ఎస్టీ కాలనీలో రోడ్డు వెడల్పులో భాగంగా రాళ్లు పేల్చడానికి సిద్ధంచేయగా, అవి అకస్మాత్తుగా పేలడంలో ఇళ్లపై పడి గోడలు దెబ్బతిన్నాయి. ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. దీనిపై స్థానికుల ఫిర్యాదుతో హైవే అధికారులను ఎస్ఐ రామ్మోహన్ పిలిపించి.. పేలుడు సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే బుధవారం నాటి ఘటన చోటుచేసుకుందన్న విమర్శలు వచ్చాయి.

వరసిద్ధుడికి చందనాలంకారం

● కాణిపాకంలో ఘనంగా వనభోజనాలు

ఐరాల(కాణిపాకం), జనవరి 17: కాణిపాక వరసిద్ధుడి మూల విరాట్‌కు బుధవారం చందనాలంకారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఆర్యవైశ్య మహాసభ మాజీ అధ్యక్షుడు సల్లా శివశంకర్ ఉభయదారుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం మూలవిరాట్‌ను శుద్ధమైన చందనంతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం స్థానికంగా ఉన్న కొబ్బరితోటలో వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అందరూ ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఐరాలలో ఆర్యవైశ్యులు వనభోజనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సాయంత్రం కాణిపాకంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడికి ఊంజల్ సేవను ఘనంగా నిర్వహించారు.



ధ్వజస్తంభానికి చేపట్టిన పుష్పాలంకరణ

నెలాఖరులోపు పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 17: జిల్లాలోని పాడిపశువులకు నెలాఖరులోపు గాలికుంటు వ్యాధి టీకాలు వేయనున్నట్లు పశుసంవర్థక శాఖ జేడీ ప్రభాకర్ బుధవారం తెలిపారు. జిల్లాలో 5.5 లక్షల పశువులు ఉండగా, 4.90 లక్షల డోసేజ్ టీకాలు వచ్చాయన్నారు. 32వ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలోని 3 లక్షల పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసినట్లు తెలిపారు. కాగా నెలాఖరులోపు మిగిలిన 1.90 లక్షల డోసేజ్‌లను పశువులకు వేస్తామన్నారు. వ్యాక్సినేషన్ పూర్తి ఉచితమే కాకుండా పాడి రైతుల ఇంటి వద్దకే వెళ్లి టీకాలు వేయనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కార్మికులు మరణిస్తున్నా.. కరగని అధికారుల మనసు

● 127వ రోజుకు చేరిన డెయిరీ కార్మికుల దీక్ష

చిత్తూరు (సెంట్రల్), జనవరి 17: దీక్ష చేస్తూ కార్మికులు మరణిస్తున్నా, అధికారుల మనసు కరగడం లేదని కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ విజయా డెయిరీ కార్మికులు కలెక్టరేట్ ముందు చేపట్టిన దీక్ష బుధవారానికి 127వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఈశ్వర్ మొదలియార్ చనిపోగా, రామ్మూర్తి తలలో గడ్డతో తీవ్రంగా బాధపడుతున్నారని, కార్మికుడు సుబ్రమణ్యం కిడ్నీ సమస్యతో బాధపడుతూ సీఎంసీలో చికిత్స పొందుతున్నారన్నారు. దీక్ష చేస్తున్న కార్మికులు స్తోమత లేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నా, అధికారుల మనసు మాత్రం కరగకపోవడం దారుణమన్నారు. ఇకనైనా తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.దీక్షలో కార్మికులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ముందు దీక్ష చేస్తున్న కార్మికులు

తప్పుల్లేని తుది ఓటరు జాబితా సిద్ధం చేయండి

● అధికారులకు టీడీపీ నేతల అభ్యర్థన

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: 'మృతుల పేర్లు తొలగించాలని, అధికార పార్టీ నమోదు చేసిన వేలాది దొంగఓట్లు రద్దుచేయాలని కోరుతూ గతంలో ఫిర్యాదులు ఇచ్చాం. వాటిని ముసాయిదా ఓటరు జాబితాలో తొలగించలేదు. కనీసం ఈనెల 22న విడుదల చేసే తుది ఓటరు జాబితాలోనైనా వాటన్నింటిని తొలగించండి. జాబితా తప్పుల్లేకుండా చూడాలి' అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వి.సురేంద్రకుమార్ అభ్యర్థించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో రాజకీయపార్టీల ప్రతినిధులతో డీఆర్వో రాజశేఖర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ.. గతంలో పార్టీ తరపున ఇచ్చిన ఫిర్యాదులను అధికార యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. డీఆర్వో మాట్లాడుతూ 1400 మందికి మించి ఓటర్లు ఉన్న చోట కొత్త పోలింగ్ కేంద్ర ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. డిసెంబరు 9వ తేదీ వరకు అందిన క్లైయిమ్‌ల విచారణ పూర్తిస్థాయిలో జరిగిందని చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే రోజు వరకు ఓటర్ల నమోదుకోసం దరఖాస్తుల స్వీకరణ జరుగుతుందన్నారు. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా కళాశాలలు, ఇతర ప్రాధాన్యత గల ప్రదేశాల వద్ద ఓటర్ల కోసం ఈవీఎంలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాస్కర్, పరదేశి (కాంగ్రెస్), ఉదయ్‌కుమార్ (వైసీపీ), ఇతర పార్టీల ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

నేటి నుంచి హెల్తీ విలేజ్ జాతీయ సదస్సు

● ముస్తాబైన మహిళా యూనివర్శిటీ ● వివిధ రాష్ట్రాల నుంచి ప్రజాప్రతినిధులు, అధికారులు రాక

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17: కేంద్ర, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో పద్మావతి విశ్వవిద్యాలయం వేదికగా గురువారం నుంచి మూడు రోజుల పాటు సుస్థిర అభివృద్ధి, లక్ష్యాల స్థానికీకరణపై ఆరోగ్యకరమైన గ్రామం(హెల్తీ విలేజ్) జాతీయ సదస్సు జరగనుంది. కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆధ్వర్యంలో వర్సిటీ ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బుడితి రాజశేఖర్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి ఏర్పాట్లను పరిశీలించారు. వైద్యశాఖ, డీఆర్‌డీఏ, మెప్మా, టీటీడీ, మహిళా శిశు సంక్షేమ శాఖల స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. మొదటి రోజు కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి గిరిరాజ్‌సింగ్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర సహాయ మంత్రి (పంచాయతీరాజ్‌శాఖ మంత్రి) కపిల్ మోరేశ్వర్ పాటిల్ పాల్గొంటారు. రాష్ట్రం నుంచి డిప్యూటీ సీఎం, పంచాయతీరాజ్‌శాఖ మంత్రి బుడి ముత్యాలనాయుడు, జిల్లా మంత్రులు హాజరవుతారు. వివిధ రాష్ట్రాల నుంచి 800మంది ప్రతినిధులు హాజరవుతారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సదస్సులో ముఖ్య అతిథి సందేశం తర్వాత వివిధ రాష్ట్రాల మధ్య చర్చలు జరుగుతాయి. శనివారం జిల్లాలోని ఆదర్శగ్రామాల్లో 250 మంది అతిథుల క్షేత్రస్థాయి సందర్శన ఉంటుంది.



సదస్సు ఏర్పాట్లును పరిశీలిస్తున్న ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ తదితరులు

గణతంత్ర వేడుకలు విజయవంతం చేద్దాం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 17: గణతంత్ర దిన వేడుకలను సమన్వయంతో విజయవంతం చేద్దామని జేసీ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. బుధవారం ఆయన డీఆర్వో రాజశేఖర్‌తో కలిసి అధికారులతో సమీక్షించారు. పోలీసు పరేడ్ మైదానంలో 26న ఉదయం 9 గంటలకు ఈ వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల స్టాళ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమ నిర్వహణలో పొరపాట్లకు తావివ్వకుండా చూడాలన్నారు.

జల్లికట్టు వేడుకల్లో విషాదం

ఎద్దు పొడవడంతో తిరుపతివాసి మృతి

చంద్రగిరి, జనవరి 17: చంద్రగిరి మండలంలో బుధవారం నిర్వహించిన జల్లికట్టు వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది.మల్లయ్యపల్లె, దోర్నకంబాల, మండపంపల్లెల్లో నిర్వహించిన జల్లికట్టు సంబరాలతో మూడు గ్రామాలూ తిరుణాళ్ళను తలపించాయి. కోడెగిత్తలను నిలువరించి చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు యువత పోటీ పడ్డారు.ఈ ప్రయత్నంలో కొంతమంది గాయపడ్డారు.అనుప్పల్లి-చంద్రగిరి రోడ్డు మార్గంలో వాహనాల రాకపోకలు పెరిగిపోవడంతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించిపోయింది. మల్లయ్యపల్లె సమీపంలోని ధనేశ్వరమ్మ ఆలయం వద్ద బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చెందిన గురుప్రసాద్ రోడ్డు దాటుతుండగా ఓ ఎద్దు పొడవడంతో అపస్మారస్థితికి చేరుకున్నాడు. 108అంబులెన్సులో తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు.




దోర్నకంబాల, జల్లికట్టు ఫోటోలు - ఎద్దు ఢీ కొనడంతో గురుప్రసాద్‌ను ఆసుపత్రికి తరలిస్తున్న దృశం

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రాయితీల కోసం పట్టు రైతులు, రీలర్ల నిరసన



పట్టుపరిశ్రమ కార్యాలయం వద్ద రైతులు, రీలర్లు నిరసన

పలమనేరు, జనవరి17 : పలమనేరు ప్రభుత్వ పట్టుపరిశ్రమ కార్యాలయం వద్ద బుధవారం ప్రభుత్వం కొన్నేళ్లుగా నిలిపి వేసిన రాయితీల కోసం పట్టురైతులు, రీలర్లు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పట్టురైతు సంఘ నాయకుడు గురుమూర్తి మాట్లాడుతూ పెరిగిన కూలీలు, ఎరువుల ధరలతో కష్టపడి మల్బరీ సాగు చేస్తున్నా పట్టుగూళ్లకు గిట్టుబాటు ధరలేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతుల కష్టాన్ని గమనించి గత ప్రభుత్వాలు కిలో పట్టుగూళ్లు పండించిన రైతులకు మార్కెట్‌కు తీసుకు వచ్చిన సందర్భంగా కిలోకు రూ.50 చొప్పున ఇన్సెంటివ్ ఇచ్చేదని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిలిపి వేసిందన్నారు. మల్బరీ రైతులకు ఇస్తున్న ప్రోత్సాహకాలను కూడా నిలిపివేసిందన్నారు. అంతేకాక మల్బరీలో యాంత్రీకరణ కోసం రైతులకు ఇస్తున్న సబ్సిడీ యంత్ర పరికరాలు కూడా నిలిపి వేశారని పేర్కొన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి రైతులకు చెల్లించవలసిన ఇన్సెంటివ్‌ను బకాయిలతోపాటు చెల్లించాలని, పట్టురైతులకు యాంత్రిక పరికరాలు, మందులు సబ్సిడీతో ఇవ్వాలని కోరారు.

జయహో బీసీ సభను జయప్రదం చేయండి



బీసీ సభ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న గౌనివారి

రామకుప్పం, జనవరి 17: రామకుప్పంలో ఈనెల 23న నిర్వహించే జయహో బీసీ సభను కార్యకర్తలు, నేతలు కలిసి జయప్రదం చేయాలని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి గౌనివారి శ్రీనివాసులు కోరారు. బుధవారం పార్టీ కార్యాలయంలో సభ ఏర్పాట్లపై సమీక్ష, మీడియా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఈనెల 23న ఉదయం 10గంటలకు పట్టణ శివార్లలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయ సమీపంలో జరిగే ఈ సభకు భారీ సంఖ్యలో బీసీ హాజరయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. వైసీపీ పాలనలో బీసీలకు జరిగిన అన్యాయాలను, అరాచకాలను, దౌర్జన్యాలను ఎండగట్టం, టీడీపీ పాలనలో బీసీల అభ్యున్నతికి చేపట్టిన కార్యక్రమాలు, తిరిగి అధికారంలోకి రాగానే బీసీల సంక్షేమం, రక్షణ కోసం అమలు చేసే పథకాలను ఈ సభలో వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పట్రనారాయణాచారి, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, బీసీసెల్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి మనోహర్, పార్టీ మండల ప్రధానకార్యదర్శి నరసింహులు, బీసీసెల్ నియోజకవర్గ ప్రధానకార్యదర్శి వెంకటరమణ, తెలుగుయువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులతో తరచూ ట్రాఫిక్ సమస్య



పుంగనూరు, జనవరి17: పుంగనూరు జాతీయ రహదారి విస్తరణ పనులతో తరచూ ట్రాఫిక్ స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుంగనూరు భీమగానిపల్లె బైపాస్ రోడ్డు నుంచి గూడూరుపల్లె మీదుగా అరబిక్ కాలేజీ బైపాస్ రోడ్డు వరకు కొంతకాలంగా పనులు జరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కొన్ని నిర్మాణాలు కూల్చివేస్తూ మురుగు నీటి కాల్వలు కడుతున్నారు. దీంతో అంబేడ్కర్ సర్కిల్, ఎన్టీఆర్ సర్కిల్, మదనపల్లెరోడ్డు, పాత బస్టాండ్, ఇందిరాసర్కిల్, ఎంబీటీరోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఆలయ భూముల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



చౌడేపల్లె, జనవరి17: ఆలయ భూముల్లో గ్రూప్ టెంపుల్స్ ఈవో కమలాకర్ ఎట్టకేలకు బోర్డులు బుధవారం ఏర్పాటు చేశారు. ఈనెల 9న ఆంధ్రజ్యోతిలో కాశీ విశ్వేశ్వర స్వామి మాన్యంలో అక్రమ నిర్మాణం-పట్టించుకోని అధికారులు అనే వార్త రావటంతో అధికారులు స్పందించి ఆలయ భూముల్లో సర్వే నంబర్లు, భూమి విస్తీర్ణంతోసహా బోర్డులు ఏర్పాటు చేశారు. ఈవో కమలాకర్ మాట్లాడుతూ వచ్చే నెల నుంచి ఆలయ మాన్యం భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారి నుంచి అద్దె వసూళ్ళు చేయనున్నట్లు తెలిపారు. కాగా అక్రమ నిర్మాణాలు మాత్రం యథేచ్ఛగా జరుగుతుండటం గమనార్హం.

ఆర్థిక వనరుల సేకరణపై అవగాహన



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు రూరల్, జనవరి17: గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఆర్థిక వనరుల సేకరణపై ప్రజాప్రతినిధులకు అవగాహన అవసరమని ఎంపీపీ భాస్కర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీలు ఆర్థిక వనరుల సేకరణ ఎలా చేయాలి, ఏ శాఖ నుంచి ఎంత డబ్బు ఖర్చు చేసిన వివరాలు సేకరించి వాటితో గ్రామ పంచాయతీ బడ్జెట్‌ను తయారు చేయాల్సివుంటుందన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి ఎంపీడీవో రాజేశ్వరి, బోయకొండ ఆలయ కమిటీ ఛైర్మన్ నాగరాజరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రీడా పోటీలు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పుంగనూరు రూరల్, జనవరి17: మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొనడానికి అవకాశం ఉందని మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషా తెలిపారు. బుధవారం మండలంలోని ఏతూరు సమీపంలో జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఆయన పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహించడానికి ప్రభుత్వం క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ప్రార్థనా మందిరంలో పరికరాలు విధ్వంసం

సోమల, జనవరి 17: నంజంపేట మార్గంలోని సోమల క్రైస్తవ ప్రార్థనా మందిరంలో కొన్ని వస్తువులను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారని పాస్టర్ మోజసీపాల్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ప్రార్థనా మందిరం గేటు, డోరును పగుల కొట్టి దుండగులు లోపలకు ప్రవేశించి పలు పరికరాలను నష్టపరిచారన్నారు. ఈ మేరకు ఎస్ఐ వెంకట నరసింహులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

నేడు రొంపిచెర్లలో ఎన్టీఆర్ వర్ధంతి

రొంపిచెర్ల: రొంపిచెర్లలో ఈనెల 18వ తేదీ దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వర్ధంతి నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఐ టీడీపీ అధ్యక్షుడు గూడురు హరిబాబు తెలిపారు. టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోలాహలంగా పశువుల పండుగ





టి.సదుమూరులో ఎద్దులను నిలువరించేందుకు యత్నిస్తున్న యువకులు, పత్రపల్లెలో పశువుల పండుగ



వీర్నమలలో జనసమూహం మధ్య పరుగులు తీస్తున్న ఎద్దులు

కుప్పం, జనవరి 17: కుప్పం మండలం మల్లానూరు పంచాయతీ టి.సదుమూరు గ్రామంలో బుధవారం ఎద్దుల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ సమీపంలోని మైదానంలో ప్రత్యేకమైన ఏర్పాట్లు ఇందుకోసం చేశారు. ఏపీనుంచే కాక, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలలోని సరిహద్దు గ్రామాలనుంచి సైతం కోడెగిత్తలను తీసుకొచ్చి ఈ పండుగలో వదిలారు. బరిలో వదిలిన ఈ ఎద్దులను పట్టుకోవడానికి యువకులు పోటీలు పడ్డారు. ఈ సందర్భంగా కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎద్దుల పండుగను పురస్కరించుకుని మల్లానూరు పంచాయతీ మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. తరలివచ్చిన తినుబండారాల దుకాణాలు, కల్లు దుకాణాలు, పిల్లలు ఆడుకునే ఆట వస్తువుల దుకాణాలతో పరిసరాలు నిండిపోయాయి.

సోమల : మండలంలోని పలు గ్రామాల్లో పశువుల పండుగను బుధవారం ఘనంగా జరుపుకొన్నారు. ఆవులపల్లె పంచాయతీ పత్రపల్లె, కొత్తూరు, ఇరికిపెంట పంచాయతీలోని ఇరికిపెంట, మేటిమంద, ఎర్రనాగులపల్లె, గంగిరెడ్డిపల్లె తదితర గ్రామాల్లో పశువులను సుందరంగా అలంకరించి గ్రామ వీధుల్లో పోటీలు నిర్వహించారు. యువకులు పశువులకు కట్టిన ప్రభలను, నగదు కానుకలను కైవశం చేసుకునేందుకు పోటీలు పడ్డారు. సాయంత్రం కాటమ రాజు ఆలయాల వద్దకు ప్రదర్శనగా వెళ్లి పూజలు చేసి చిట్లాకుప్పల చుట్టూ ప్రదక్షణలు చేయించారు. రాత్రి మహిళలు దీలు, బోనాలతో మొక్కులు తీర్చుకుని జంతుబలులు జరిపారు.

రామకుప్పం : వీర్నమలలో బుధవారం ఎద్దుల పండుగ కోలాహలంగా జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు గామదేవత గంగమ్మ ఆలయంలో అమ్మవారికి, పశువులకు ప్రత్యేక పూజలు నిర్వహించి, గ్రామ ప్రధానవీధుల్లో ఊరేగించారు. అనంతరం పాత పంచాయతీ కార్యాలయం వీధిలో ఏర్పాటు చేసిన బరిలో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ ఎద్దులను డప్పులహోరు మధ్య పరుగులు తీయించారు. దూసుకెళ్తున్న ఎద్దులను నిలువరించి, నిర్వాహకులు వాటికి కట్టిన లుంగీలను చేజిక్కించుకునేందుకు యువకులు పోటీలు పడ్డారు. ఎద్దుల పండుగను తిలకించేందుకు వచ్చిన అశేష జనంతో వీర్నమల జనసంద్రంగా మారింది.

ఘనంగా సంక్రాంతి సంబరాలు





రామకుప్పం సల్లాపురెమ్మ ఆలయంలో పొంగళ్ళు సమర్పిస్తున్న మహిళలు, సప్తమాతృక చౌడేశ్వరమ్మ ఆలయం వద్ద పొంగళ్ళు సమర్పిస్తున్న మహిళలు

రామకుప్పం, జనవరి 17: రామకుప్పంలో బుధవారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఉదయం పట్టణంలోని గ్రామదేవత ఆలయాల్లో అమ్మవార్లకు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 4గంటలకు డప్పుల హోరు, బాణసంచా పేలుళ్ళ మధ్య రైతు కుటుంబాలు పట్టణ శివార్లలోని సప్తమాతృక చౌడేశ్వరమ్మ ఆలయానికి చేరుకుని అమ్మవారికి పొంగళ్ళు సమర్పించి, దీపారాధనలు చేశారు. అనంతరం వివిధ అమ్మవారి ఆలయాల వద్దకు చేరుకుని పొంగళ్ళు సమర్పించి, దీపారాధనలు చేశారు. అన్ని ఆలయాల్లో అమ్మవార్లకు గొర్రెలు, కోళ్ళు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

చిన్నతాండాలో గంగజాతర



పుంగనూరు రూరల్, జనవరి17: మండలంలోని చిన్నతాండాలో గంగజాతరను వైభవంగా నిర్వహించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం గ్రామ దేవతకు ప్రత్యేక పూజలు చేసి పెరుగు అన్నం, చల్లలు సమర్పించి జంతుబలులు చేశారు. ఏడాది ఒక్కసారి పశువుల పండుగ కావడంతో దూర ప్రాంతాల్లో ఉన్న బంధువులు స్వగ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు బంధువులతో సందడి నెలకొంది.

బతుకులతో ఆడుకుంటే అధోగతే

హెచ్చరించిన అంగన్వాడీలు





కుప్పంలో దీక్షలు చేస్తున్న అంగన్వాడీలు, నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీ వర్కర్లు

కుప్పం, జనవరి 17: తమ బతుకులతో ఆడుకుంటే అధోగతి తప్పదని అంగన్వాడీలు హెచ్చరించారు. కుప్పంలో అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షలు 37వ రోజైన బుధవారంనాడు కూడా కొనసాగాయి. సీఐటీయూ నాయకురాలు లలిత, ఇతర అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు మాట్లాడుతూ ఎస్మా ప్రయోగాలు, ధర్నాలను అడ్డగించి పోలీసుస్టేషన్లకు తరలించడం వంటి అణచివేత చర్యలతో ఉద్యమాలను లేకుండా చేయలేరన్నారు. అణచేకొద్దీ తమ పట్టుదల ఇంకా పెరుగుతుందన్నారు.ఇకనైనా ప్రభుత్వం తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరారు.

పలమనేరు : పలమనేరులో బుధవారం అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ప్రభుత్వం జారీచేసిన జీఓ2పై నిరసన చేపట్టారు. వారు మాట్లాడుతూ గత 37 రోజులుగా తాము తమ జీతాల పెంపు కోసం సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణ మన్నారు. ఏదేమైనా తమ కోర్కెలు పరిష్కరించేంత వరకు తాము ఆందోళనను విరమించే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు గిరిధరగుప్తా, రాధ, శాంతి, ఇషాద్, అనసూయ, ధనమ్మ, రాధ, గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా జలాలకు పూజలు



హంద్రీ-నీవా జలాల్లోకి పూలు వేస్తున్న భరత్ తదితరులు

రామకుప్పం, జనవరి 17: మండల పరిధి వర్థికుప్పం గ్రామం వద్దకు హంద్రీ-నీవా జలాలు చేరుకోవడంతో బుధవారం ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, పార్టీ ప్రజాప్రతినిధులతో కలిసి పూజలు చేశారు. కుప్పం ప్రాంతానికి హంద్రీ-నీవా జలాలను తీసుకువచ్చి సీఎం జగన్ కుప్పం ప్రజలకిచ్చిన మాటను నిలుపుకొన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి, ప్రచార కార్యదర్శి కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకురావాలి

పుంగనూరు, జనవరి17: ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావడానికి వైఎస్ షర్మిల పార్టీ బాధ్యతలు తీసుకున్నట్లు పుంగనూరు కాంగ్రెస్ నాయకుడు సజ్జాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ఇందిరాగాంధీ చిత్రపటం ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి ఏపీలో కాంగ్రెస్ మనుగడ సాధించడం కష్టంగా ఉన్న సమయంలో షర్మిలమ్మ బాధ్యతలు తీసుకుని పార్టీని ముందుకు నడపడానికి కృషి చేయడం అభినందనీయమన్నారు.

చల్లా పర్యటనను విజయవంతం చేయాలి

చౌడేపల్లె, జనవరి17: పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మండల పర్యటనను విజయవంతం చేయాలని మండల పార్టీ అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం తెళ్ళనీళ్లపల్లెలో టీడీపీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈనెల 20న దుర్గసముద్రం, 21న చౌడేపల్లె పంచాయతీలలో చల్లా రామచంద్రారెడ్డి పర్యటించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా రాధిక నియామకం



కుప్పం, జనవరి 17: కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా రాధికను నియమిస్తూ రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్ కోటేశ్వరరావ్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు బుధవారం రాధిక కుప్పం కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సుధీర్ ఆమెకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

ఐఆర్ఎం కళాశాలలో రేపు జాబ్ మేళా

కుప్పం, జనవరి 17: కుప్పంలోని ఐఆర్ఎం డిగ్రీ కళాశాలలో ఈనెల 20న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ఛైర్మన్ దయానిధి తెలిపారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ నగరాలకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు పాల్గొంటాయన్నారు. సుమారు 20 సంస్థలు పాల్గొనే ఈ జాబ్ మేళాలో డిగ్రీ, పీజీ పూర్తి చేసిన విద్యార్థులు శనివారం ఉదయం 9 గంటలకు వారి పేర్లు నమోదు చేసుకుని వారి బయోడేటాతో పాటు ధ్రువపత్రాలను తెచ్చుకోవాలని కళాశాల అకడమిక్ డైరెక్టర్ మధుసూదనరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ లక్ష్మీ కోరారు.

వైసీపీ మండల యూత్ అధ్యక్షుడిగా బాలాజీ



వి.కోట, జనవరి 17: వి.కోట మండల వైసీపీ యూత్ అధ్యక్షుడిగా గంధారమాకులపల్లెకు చెందిన బాలాజీని ఎంపిక చేస్తూ ఎమ్మెల్యే వెంకటేగౌడ ప్రకటించారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి పార్టీ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని బాలాజీ అన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

రామకుప్పం, జనవరి 17: తెలుగు మహిళ రామకుప్పం పంచాయతీ అధ్యక్షురాలు సుబ్బమ్మ భర్త నాగరాజు బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. తెలుగుమహిళ మండల అధ్యక్షురాలు పద్మమ్మ, మాజీ సర్పంచు రామకృష్ణప్ప తదితరులు నాగరాజు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం పార్టీ తరపున మృతుడి కుటుంబసభ్యులకు రూ.10వేలు అందజేశారు.

ఎన్టీఆర్ ట్రస్టు వైద్య శిబిరం విజయవంతం



కుప్పం రూరల్, జనవరి 17: కుప్పం మండలం గుడ్లనాయనిపల్లెలో బుధవారం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 110 మంది రోగులకు బీపీ, షుగర్, ఇతర వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్ మధు, ఝాన్సీరాణి, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు కుప్పంలో ఎన్టీఆర్ వర్ధంతి

కుప్పం, జనవరి 17: కుప్పంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం 10 గంటలకు దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 28వ వర్ధంతి ఘనంగా నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.ఈ సందర్భంగా కుప్పం ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంచిపెడుతామని చెప్పారు. పార్టీ శ్రేణులన్నీ పాల్గొనాలని కోరారు.

వైసీపీ కుప్పం బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా చంద్రప్ప గౌడ్



గుడుపల్లె, జనవరి 17: మండలంలోని బూరుగురుపల్లెకు చెందిన బి.చంద్రప్ప గౌడ్‌ను వైసీపీ కుప్పం నియోజకవర్గం బీసీ సెల్ ఉపాధ్యక్షుడిగా ఎమ్మెల్సీ భరత్ నియమించారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానని ఆయన తెలిపారు.

క్యాలెండరు ఆవిష్కరణ



పలమనేరు, జనవరి17 : పలమనేరు సమీపంలోని చౌడేశ్వరమ్మ ఆలయం వద్ద ఉన్న వన్నెకుల క్షత్రియ కార్యాలయంలో బుధవారం రాయలసీమ వన్నెకుల క్షత్రియ సంఘం ముద్రించిన క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ అధ్యక్షుడు పూసల రవి, సంఘం అధ్యక్షుడు శ్రీనివాసన్, నాయకులు మునియప్పన్, లక్ష్మయ్య, మునిరత్నం, గోపీకృష్ణ, బుజ్జిబాబు, నటరాజన్, జగదీష్, హరికృష్ణ, మణి తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ వన్నెకుల క్షత్రియులు ఐకమత్యంతో ఉండాలన్నారు.

రేపు వేమారెడ్డి జయంత్యుత్సవాలు

పలమనేరు, జనవరి17 : పలమనేరులో ఈనెల 19వ తేదీ యోగి వేమారెడ్డి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం సలహాదారు రెడ్డివారి అమరనాథరెడ్డి తెలిపారు. జయంతి ఉత్సవాలను పలమనేరు బైపాస్ రోడ్డు పక్కన ఉన్న వేమారెడ్డి ఉద్యానవనంలో వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వయోవృద్ధులకు సన్మాన కార్యక్రమం, 100 పద్యాలు వల్లె వేసిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర విజేత కందూరు టీమ్



సోమల, జనవరి 17: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి వాలీబాల్, క్రికెట్ క్రీడల్లో కందూరు పంచాయతీ టీములు ప్రతిభ కనబరిచినట్లు ఎంపీడీవో నాగరాజ తెలిపారు. బుధవారం స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో పోటీలు జరిగాయి. హోరాహోరీగా సాగిన పోటీల్లో కందూరు పంచాయతీ టీములు ఎంపిక కావడంతో ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ బాషా మసూద్, కార్యదర్శి జయశంకర్ టీము సభ్యులను అభినందించారు. విజేతలకు క్రీడా కిట్లు అందజేశారు.

తూర్పుమొగసాలలో వైద్య పరీక్షలు



పుంగనూరు, జనవరి17: స్థానిక తూర్పుమొగసాలలోని హెల్త్‌సెంటర్‌లో బుధవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఛైర్మన్ అలీంబాషాతో కలసి కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 349 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ రంజిత, పుష్పకుమారి, రాహులు తదితరులు పాల్గొన్నారు.

తమ్మినాయనపల్లెలో 'వికసిత్ భారత్'



మాట్లాడుతున్న వైద్యాధికారి విజయలక్ష్మి

సోమల, జనవరి 17: మండలంలోని తమ్మినాయనపల్లెలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర గ్రామసభ నిర్వహించారు. కందూరు వైద్యాధికారి విజయలక్ష్మి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తద్వారా ప్రజలకు ఏవిధమైన లబ్ధి చేకూరుతుందో వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేంద్రరెడ్డి, ఎంపీహెచ్ ఈవో కుమార్, ప్రమీలమ్మ, జయమ్మ, కార్యదర్శి నాగభూషణం, వీఆర్వో జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు టీడీపీ బీసీ సెల్ సమావేశం

శాంతిపురం, జనవరి 17: టీడీపీ బీసీసెల్ శాంతిపురం మండల శాఖ సమావేశం గురువారం నిర్వహిస్తున్నట్లు బీసీ సెల్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు చలపతి, గణేష్ తెలిపారు. ఉదయం 10గంటలకు పార్టీ కార్యాలయంలో జరిగే ఈ సమావేశంలో ఈనెల 24న నిర్వహించనున్న జయహో బీసీ గురించి చర్చిస్తామని తెలిపారు.

వైభవంగా వీరభద్రస్వామి తిరుణాళ్ల



ఊరేగింపులో విచిత్ర వేషధారణలతో కళాకారులు

చిత్తూరు కల్చరల్, జనవరి 17: నగరపాలక పరిధిలోని నరిగపల్లె గ్రామస్తులు బుధవారం వీరభద్రస్వామి తిరుణాళ్లను అత్యంత వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి గ్రామస్తులు స్వామివారికి నైవేద్యంగా కోళ్ళు, పొట్టేళ్ళు, మేకపోతులు, దున్నపోతులను బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామస్తులందరూ తమ బంధుమిత్రులతో కలిసి సామూహిక వనభోజనాలు చేశారు. ఈ తిరునాళ్ళను మాపాక్షి, అనుప్పల్లె, గంగసాగరం, రెడ్డిగుంట, ప్రశాంత్‌నగర్, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి రాగా, నరిగపల్లెలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ నిర్వాహకులు కృష్ణయ్య, కుప్పయ్య నాయుడు, బాలక్రిష్ణారెడ్డి, నాగయ్య, ప్రకాష్, ప్రభు, త్యాగరాజులు తదితరులు పాల్గొన్నారు.

నదుల అనుసంధానం కోసం తమిళనాడు వాసి సైకిల్ యాత్ర



సైకిల్ యాత్ర చేస్తున్న సంజీవి

చిత్తూరు సిటీ, జనవరి 17: నదుల అనుసంధానం కోసం సైకిల్ యాత్ర చేస్తున్నట్లు తమిళనాడు రాష్ట్రం తిరువల్లూరు జిల్లా అమ్మయ్యార్ కుప్పంకు చెందిన సంజీవి చెప్పారు. బుధవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలో నదుల అనుసంధానం చేయాలని కోరుతూ సైకిల్ యాత్ర చేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే దక్షిణ భారతదేశంలోని కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాలు, ఉత్తర భారతదేశంలోని పలు రాష్ట్రాల్లో సైకిల్ యాత్రను దిగ్విజయంగా పూర్తిచేశానని తెలిపారు. వివిధ రాష్ట్రాలలో ఉన్న నదులను అనుసంధానం చేసి సాగునీటి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రస్తుతం చిత్తూరు నుంచి సేలంకు సైకిల్ యాత్రను ప్రారంభిస్తున్నానని పేర్కొన్నారు. సేలంలో ఈనెల 21వ తేదీన డీఎంకే పార్టీ రాష్ట్ర సదస్సు నిర్వహిస్తారని, ఈ సదస్సుకు ముఖ్యమంత్రి స్టాలిన్ హాజరవుతారని, అక్కడ ఆయనను కలసి నదుల అనుసంధానం గురించి తన అనుభవాలను తెలియజేస్తానని చెప్పారు. అనంతరం ఆయన సైకిల్ యాత్రను ప్రారంభించారు.

భక్తి ప్రపత్తులతో కాటమరాజు పండుగ

చిత్తూరు కల్చరల్, జనవరి 17: స్థానిక గొడుగుమూరులో బుధవారం పశువులకు అధిపతి కాటమరాజు పండుగను గ్రామస్తులు అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపుకున్నారు. గ్రామస్తులు గ్రామంలోని పశువులను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాణసంచా వేడుకలతో, మేళతాళాలతో ఊరేగింపుగా పశువులను తీసుకుని పీవీకేఎన్ ప్రభుత్వ కళాశాల వెనుక చిట్లాకుప్ప వద్దకు తరలించారు. చిట్లాకుప్ప వద్ద కాటమరాజుకు గ్రామస్థులు పూజలు నిర్వహించి, చిట్లాకుప్పను తగులబెట్టి పశువులను బెదిరించారు.

బొంతల గంగమ్మకు పొంగళ్లు



మంటల చుట్టూ పాడి ఆవులను తిప్పుతున్న దృశ్యం

గంగాధరనెల్లూరు, జనవరి 17: మండలంలోని వీరకనెల్లూరు దళితవాడలో పలువురు మహిళలు బుధవారం బొంతల గంగమ్మకు పొంగళ్లు పెట్టిన అనంతరం కాటమరాజుకు నైవేద్యం పెట్టి చిట్లకుప్పకు అగ్నిమంటలు వేసి వాటిచుట్టూ పాడిఆవులను తిప్పి ఆచారాన్ని నిర్వహించారు. ఆవులు, ఎద్దులు, దూడల మెడలకు కొత్తగా గంటల దారాన్ని కట్టి, కొమ్ములకు రంగులు వేసి, వివిధ రకాల రిబ్బన్‌లు కట్టారు. అనంతరం ముళ్ళకంపలు గుట్టగావేసి (చిట్లకుప్ప)కు అగ్నిమంటలు వేసి పాడిఆవులను వాటిచుట్టూ తిప్పారు.


32ఏళ్ల తర్వాత పూర్వవిద్యార్థుల సమ్మేళనం



అప్పటి టీచర్లతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

గంగాధరనెల్లూరు, జనవరి 17: గంగాధరనెల్లూరు మండలం మేనాటంపల్లె(సిద్దేశ్వరకొండ) జిల్లాపరిషత్ హైస్కూలులో 1992-93 సంవత్సరంలో 7వతరగతి చదివిన విద్యార్థులు బుధవారం కలుసుకున్నారు. 32 ఏళ్ళ తర్వాత ప్రస్తుత స్కూల్ ఎడ్యుకేషన్ కమిటీ చైర్మన్, అప్పటి విద్యార్థి మురళిరెడ్డి ఆధ్వర్యంలో 42 మంది విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. ఈ సందర్భంగా వారు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. సమావేశానికి అప్పటి గురువులైన నటరాజ్ (హెడ్‌మాస్టర్), చలపతి, బాబు నాయుడు, వరదారెడ్డిలకు పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానం చేసి, అనంతరం బహుమతులను అందజేసి, తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు ఐరన్ బీరువా కొనిచ్చారు. భవిష్యత్‌లో తాము విద్యాభ్యాసం చేసిన హైస్కూల్‌కు మరింత తోడ్పాటు అందించనున్నట్లు పూర్వవిద్యార్థులు పేర్కొన్నారు.

తెలుగు మహిళలకు చంద్రన్న కానుక పంపిణీ



చంద్రన్న కానుక అందిస్తున్న సినీనటుడు యువ

నగరి, జనవరి 17: నగరి పట్టణ పరిధిలోని సామాలమ్మ గుడి వద్ద భగవంత్ కేసరిలో నటించిన నటుడు యువ... తెలుగు మహిళలకు చంద్రన్న కానుక అందించారు. సంక్రాంతి సంబరాలలో భాగంగా నాల్గవరోజైన బుధవారం ముక్కనుమను పురస్కరించుకుని 1వ వార్డు తెలుగు మహిళలకు రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లత ఆధ్వర్యంలో నటుడు యువ చేతుల మీదుగా చీర, పసుపు, కుంకుమ, రూ. వంద నగదు అందించారు. నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి సినిమాలో ముఖ్య భూమిక పోషించిన యువ నగరిలో హల్‌చల్ చేశారు. నగరి ఆదిఆంధ్రవాడలో మాతమ్మ అమ్మవారిని దర్శించుకుని గడియారాన్ని విరాళంగా ఇచ్చారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

బంగారుపాళ్యం, జనవరి 17: మండల కేంద్రంలోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు వివిధ రంగాలకు చెందిన జాతీయ కంపెనీలు జెనిసిస్, జిప్టో, స్టోర్ తదితర కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ జాబ్‌మేళాకు 83 మంది విద్యార్థులు హాజరవ్వగా, వారిలో 32మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలం, నైపుణ్యాభిసంస్థ అధికారులు గుణశేఖర్ రెడ్డి, చైతన్య, పవన్ కుమార్ తెలిపారు.



జాబ్‌మేళాలో పాల్గొన్న విద్యార్థులు

అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 17: కాణిపాక క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి శ్రీశైలానికి చెందిన దుర్గా బుధవారం రూ.1,01,116 విరాళంగా అందించారు. విరాళదాతకు సూపరింటెండెంట్ వాసు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎంజీఆర్ జయంతి కార్యక్రమం



పేదలకు అన్నదానం చేస్తున్న అభిమానులు

చిత్తూరు కల్చరల్, జనవరి 17: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, అన్నాడీఎంకే అధ్యక్షుడు ఎంజీ రామచంద్రన్ 107వ జయంతి కార్యక్రమాలు బుధవారం నగరంలో ఘనంగా జరిగాయి. అన్నాడీఎంకే కార్యకర్తలు ఎంజీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తూ ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంజీఆర్ అభిమానులు, అన్నాడీఎంకే కార్యకర్తలు సుబ్రమణ్యం, గణేష్, జయకుమార్, బాబు, చింటూ, రాజా, నవాజ్‌ఖాన్, అన్సర్, మాజీ డిప్యూటీ మేయర్ సుబ్రమణ్యం, కరునాకరన్, రాజశేఖర్, తిరునావుక్కరసు, సంతానం, రహమాన్, వినాయకం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాయకులు

గుడిపాల, జనవరి 17: మండలంలోని యాదవ సంఘ సభ్యులు బుధవారం యాదవ సంఘ సమ్మేళనం కార్యక్రమాన్ని మాజీ ఎంపీపీ నాగరాజ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని తుమ్మలవారిపల్లె గ్రామంలో యాదవులకు అతిముఖ్యమైన కాటమరాజులు పండుగను పురస్కరించుకుని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవులు యాదవ్, కోదండ యాదవ్ మాట్లాడుతూ యాదవులు ఐక్యమత్యంతో ఉండి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్ యాదవ్, బాలసుబ్రహ్మణ్యం యాదవ్, చిట్టి యాదవ్, జయరాం యాదవ్, బాబు యాదవ్, సుధాకర్ యాదవ్, సంఘ నాయకులు పాల్గొన్నారు.

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ



వైద్యాధికారితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, జనవరి 17: చిత్తూరు మండలంలో మాపాక్షి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని మాపాక్షి హైస్కూల్‌లో బుధవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని చిత్తూరు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా శిబిరం ఏర్పాట్లు, వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా ప్రతి ఇంటికి మెరుగైన వైద్యం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. అలాగే కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి, కళ్ల అద్దాలు పంపిణీ చేస్తారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందవచ్చునన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

వరసిద్ధుడి సేవలో జీఎస్టీ చీఫ్ కమిషనర్



జ్ఞాపికను అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), జనవరి 17: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జీఎస్టీ చీఫ్ కమిషనర్ గిరిజాశంకర్ బుధవారం కుటుంబ సమేతంగా కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఆమెను ఏఈవో హరిమాధవరెడ్డి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్ విష్ణు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన ఉండాలి

పెనుమూరు, జనవరి 17: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలోని కత్తిరెడ్డిపల్లి, చింతపెంట పంచాయతీలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో పాల్గొన్నారు. కేంద్రం ఇస్తున్న 14 పథకాలకు సంబంధించి ప్రజలకు టీవీ ద్వారా చూపించారు. ఈ కార్యక్రమంలో ఏవో కళ్యాణ్‌బాబు, డాక్టర్ అనిల్‌కుమార్, సెక్రటరీలు ఉదయరేఖ, చందన ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

తవణంపల్లె, జనవరి 17: 2024-2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ప్రణాళికల తయారీపై పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ గుణశేఖర్‌రెడ్డి, అధికారులు, కార్యదర్శులు, సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఉన్న ఒక్క ఆహ్లాదం కూడా కంపుకొడుతోంది

- దుర్వాసన వెదజల్లుతున్న గంగినేని చెరువు
- ముక్కుమూసుకుంటున్న పార్కుకు వచ్చే నగరవాసులు
- పట్టించుకోని నగర పాలక సంస్థ అధికారులు



చెరువులో కలిసిన మురుగు వ్యర్థాలు, గంగినేని చెరువు పార్కులో ఆడుకుంటున్న పిల్లలు

చిత్తూరు రూరల్, జనవరి 17: చిత్తూరు నగరంలో ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగించే ప్రదేశాలు ఏవీ లేవనే చెప్పాలి. ఉన్నవాటిలో కాస్త ఆహ్లాదం కలిగించే గంగినేని చెరువు పార్కు కూడా ఇప్పుడు కంపుకొడుతోంది. దీంతో నగర వాసుల పరిస్థితి వర్ణనాతీతంగా మారింది. అనేక మంది ఎప్పుడూ పని ఒత్తిలో ఉంటూ... కాస్త సమయం దొరికితే పిల్లలతో కలిసి పార్కుల్లో సేదతీరాలనుకుంటారు. అయితే ఆ ఆహ్లాదం కూడా కంపుకొడితే... ఇప్పుడు అలాంటి పరిస్థితే నెలకొంది. నగరంలోని గంగినేని చెరువులో మురుగు నీరు కలిసి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో చెరువును అనుకొని ఉన్న చిల్డ్రన్స్ పార్కులోకి వచ్చే పిల్లలను ఇబ్బందులకు గురిచేస్తోంది. సంక్రాంతి పండుగ సందర్భంగా మూడు రోజులు సెలవు కావడంతో నగరవాసులు వారి పిల్లలతో కలిసి సేదతీరేందుకు గంగినేని చెరువుకు వస్తుంటే.. దుర్వాసన కారణంగా తల్లిదండ్రులు కూడా చేసేదేమి లేక ముక్కుమూసుకొని పిల్లల్ని ఆడించుకున్నారు. మరి కొందరు ఉండలేక ముక్కుమూసుకొని వెనుదిరుగుతున్నారు. ఇప్పటికైనా దీనిపై నగరపాలక కమిషనర్ చర్యలు తీసుకోవాలని నగరవాసులు కోరుతున్నారు.



ముక్కు మూసుకొని వెనుదిరుగుతున్న నగరవాసులు

ఎన్టీఆర్ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తాం

- సమష్టిగా పోరాడుతాం.. టీడీపీని గెలిపించుకుంటాం: పార్టీ నేతలు



మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, జనవరి 17: ఎన్టీయార్ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తామని టీడీపీ నేతలు అన్నారు. బుధవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, గురజాల జగన్మోహన్, కాజూరు బాలాజి, కటారి హేమలత, సీఆర్ రాజన్, బద్రీనారాయణ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గురువారం టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీయార్ వర్ధంతిని ఘనంగా నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం 9 గంటలకు జిల్లా పార్టీ కార్యాలయంలోని ఎన్టీయార్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం, డీసీసీబీ కార్యాలయం, జడ్పీ కార్యాలయాలలోని ఎన్టీయార్ విగ్రహాలకు నివాళులర్పిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎన్టీయార్ సర్కిల్‌లో అన్నదానం నిర్వహిస్తామని పేర్కొన్నారు. అలాగే చిత్తూరు నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అధిష్ఠానం ఎవరిని ప్రకటించినా వారి గెలుపునకు అందరూ సమష్టిగా కృషిచేస్తామని అన్నారు. ఈనెల 21వ తేదీ నుంచి టీడీపీ - జనసేన సంయుక్తంగా 'రా.. కదలిరా' కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. ఇందులో భాగంగా గడపగడపకు వెళ్లి పార్టీ ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబును సీఎం చేయడమే లక్ష్యంగా పార్టీశ్రేణులు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు.

ఉల్లాసంగా, ఉత్సాహంగా గోటు మహోత్సవం



వనభోజనం చేస్తూ చెట్ల కింద సేదతీరుతున్న నగరవాసులు

చిత్తూరు కల్చరల్, జనవరి 17: సంక్రాంతి పండుగల మరుసటి రోజు నగరవాసులు గోటు మహోత్సవం (వనభోజనం) నిర్వహించడం ఆనవాయితీ. బుధవారం నగరంలోని అటవీశాఖ చిన్నారుల పార్కు, జింకల పార్కు, గంగినేనిచెరువుపార్కు, కలువగుంట ప్రాజెక్ట్, తిమ్మసాని పల్లె చెరువు, ఉయ్యాల చింత, కట్టమంచి, చెన్నమ్మగుడిపల్లె చెరువుల వద్ద నగరవాసులు రోజంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపి వనభోజనాలు చేశారు. ప్రజలు ఆటపాటలతో గడిపారు. ప్రజల సౌకర్యార్థం తాగునీరు. పారిశుధ్య తదితర చర్యలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది పటిష్ఠమైన చర్యలు చేపట్టారు.

కాణిపాకంలో స్వచ్ఛ తీర్థ కార్యక్రమం



కల్యాణకట్ట వద్ద శుభ్రం చేస్తున్న అధికారులు, సిబ్బంది

ఐరాల(కాణిపాకం), జనవరి 17: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో బుధవారం స్వచ్ఛ తీర్థ కార్యక్రమాన్ని అధికారులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణకట్ట, వినాయక సదన్ తదితర ప్రాంతంలో శుభ్రం చేశారు. కార్యక్రమంలో ఎస్‌వీ.కృష్ణారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలగిరి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కొండచుట్టు సంబరాలు



పన్నూరు నుంచి తీసుకొచ్చిన శ్రీదేవి భూదేవి సమేత ఇష్టకామేశ్వరస్వామి

విజయపురం, జనవరి 17: సంక్రాంతి ముక్కనుమ పండుగ సందర్భంగా బుధవారం మండలంలోని ఆలపాకం, పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద కొండచుట్టు సంబరాలు(పార్వేటి ఉత్సవం) వైభవంగా జరిగింది. పన్నూరు సబ్‌స్టేషన్ వద్ద నిర్వహించిన కొండచుట్టుకు సామిరెడ్డికండ్రిగ, కళియంబాకం, అత్తూరు, పన్నూరు, మాధవరం, భూచివానత్తం, గొల్లకండ్రిగ, జగన్నాథపురం, ముత్తప్పరెడ్డికండ్రిగ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. పన్నూరులో యువత ఆధ్వర్యంలో ఇష్టకామేశ్వరస్వామిని చంద్రప్రభ వాహనంపై, పన్నూరు -2 నుంచి శ్రీకృష్ణుడిని చంద్రప్రభ వాహనంపై ఊరేగించారు. ఆలపాకం కొండ చుట్టుకు చిన్న ఆలపాకం నుంచి సీతారాముల స్వామి, కేఆర్‌పాళెం నుంచి మహాలక్ష్మి సమేత అమ్మవారిని, నెట్టేరి నుంచి శ్రీకృష్ణుడిని ఊరేగించారు. కొండచుట్టుకు పరిసర ప్రాంతాల నుంచి నింద్ర, చవరంబాకం, కచ్చరవేడు, నెట్టేరి, ఆలపాకం, కమ్మకండ్రిగ గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువ సంఖ్యలో తరలివచ్చి దేవుడి ఆశీసులు పొందారు.

వెహికల్ మెయింటెనెన్స్ పక్కాగా చేయాలి

- ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి
- పలువురికి ఉత్తమ ఉద్యోగిగా ప్రశంసా పత్రాల అందజేత



ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి

చిత్తూరు రూరల్, జనవరి 17: గ్యారేజ్‌లో వెహికల్ మెయింటెనెన్స్ పక్కాగా చేయగలిగితే రోడ్డు ప్రమాదాలను దాదాపుగా అరికట్టవచ్చునని కడప జోన్ ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఈడీ చెంగల్‌రెడ్డి అన్నారు. బుధవారం చిత్తూరు ఆర్టీసీ 2-డిపోను ఆయన తనిఖీ చేశారు. అనంతరం గ్యారేజ్‌లో జరిగిన రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో ఆయన పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిన డ్రైవర్లకు, కండక్టర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాత్రుల్లో బస్సులు నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని, చాలా మంది మద్యం మత్తులో రోడ్డుపైకి వస్తుంటారని, డ్రైవర్లే అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలో రాష్ట్రానికి 1500 కొత్త బస్సులు రానున్నాయని, జిల్లాకు కూడా కొన్ని బస్సులు కేటాయించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందు గ్యారేజ్‌లో మొక్కలు నాటారు. డిప్యూటీ సీఎంఈ నాగేశ్వరరావు, పీవో షాహజద్, డిప్యూటీ ఈఎంఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి: డీటీసీ



సమావేశంలో మాట్లాడుతున్న డీటీసీ నిరంజన్ రెడ్డి

చిత్తూరు సిటీ, జనవరి 17: డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని డీటీసీ నిరంజన్ రెడ్డి చెప్పారు. బుధవారం జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో రహదారి భద్రతా మాసోత్సవాలను ఆయన ప్రారంభించారు. బస్సు, లారీ, ఆటో డ్రైవర్లకు అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ మాట్లాడుతూ ఈ ఏడాది 'యువశక్తి ద్వారా సామాజిక మార్పు' అనే నినాదంతో మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు నెల రోజులపాటు ఆర్టీసీ డ్రైవర్లు, ప్రైవేట్ బస్, లారీ, ఆటో ఇతర వాహన డ్రైవర్లకు, కళాశాల విద్యార్థులకు, ప్రజలకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీవో సునీల్ కుమార్, ఎంవీఐలు వాసుదేవ రెడ్డి, టీఎన్ మురళి, దీపిక, ఏఎంవీఐలు ప్రసాద్ వర్మ, భాగ్యశ్రీ, ఎస్సై రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలి

పాలసముద్రం, జనవరి 17: రాబోవు అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించడానికి అంచనాలు సిద్ధం చేయాలని ఎంపీడీవో రామనాథ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వికలాంగ ఓటర్ల కోసం పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలోని 23 పోలింగ్ కేంద్రాలను ఎంఈవోలు -1, 2, అగ్రికల్చరల్ ఆఫీసర్, ఇరిగేషన్ ఏఈలతో, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పరిశీలించాలని ఆయన పేర్కొన్నారు.

మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు



బహుమతులను అందచేస్తున్న మంత్రి రోజా దంపతులు

నగరి, జనవరి 17: నగరి పట్టణ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం ముక్కనుమ నాడు నియోజకవర్గ పరిధిలోని మహిళలకు రోజా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించగా, సుమారు 500 మంది మహిళలు పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన వారికి మంత్రి రోజా, సెల్వమణి దంపతుల చేతులమీదుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో వనభోజనం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

పూతలపట్టు, జనవరి 17: మండలంలోని పూతలపట్టుకు చెందిన ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో బుధవారం వనభోజనం కార్యక్రమం జరిగింది. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఆర్యవైశ్యులు పూతలపట్టు సమీపాన గల ఓ మామిడితోపులో పెద్దఎత్తున వనభోజనం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా వాసవీ అమ్మవారి చిత్రపటాలకు పలురకాల పూజలు నిర్వహించి అన్నప్రసాదాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ మాజీ కన్వీనర్ చంద్రమౌళి, గుంటూరు మురళి, వైసీపీ నేత జగదీశ్వర్ రెడ్డి, భీమేశ్వర విద్యాసంస్థల చైర్‌పర్సన్ గౌహతి సుబ్బారెడ్డి, బాబు రెడ్డి, మల్లి, ప్రత్యూష్, శేఖర్, పవన్, సూరితో పాటు పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలకే... జనసేన కండువాలా..!

- జనసేన పార్టీ మండల అధ్యక్షుడు రూప్‌కుమార్

గుడిపాల, జనవరి 17: వైసీపీ కార్యకర్తలకు జనసేన కార్యకర్తలని చెప్పి, పార్టీలో చేరినట్లు కండువాలు కప్పడం హేయమైన చర్య అని మండల జనసేన పార్టీ అధ్యక్షుడు రూప్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండ్రోజుల క్రితం కుప్పిగానిపల్లెలో వైసీపీ నాయకులకే ఆ పార్టీ కండువా కప్పి జనసేన పార్టీ నాయకులు తమ పార్టీలో చేరారని చెప్పుకోవడం వారి విజ్ఞతకే వదులుతున్నామన్నారు. ఇకపై అలాంటి తప్పుడు ప్రచారాలు మానుకోవాలని ఆయన హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం

పెనుమూరు, జనవరి 17: మండలంలోని 42 పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, ఎక్కడైనా లేకపోతే సంబంధిత పంచాయతీ కార్యదర్శులు ఏర్పాట్లు చేయాలని మండల ప్రత్యేక అధికారి సుబ్రమణ్యం తెలిపారు. బుధవారం ఆయన ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైట్లు, నీరు, ఫ్యాన్లు, ఇతర వసతులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో భాస్కర్ నాయుడు, ఏఈలు పవన్, శశిభూషణ్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, డీటీ మహేష్ పాల్గొన్నారు.

22న శ్రీరామ పట్టాభిషేకం

చిత్తూరు కల్చరల్, జనవరి 17: స్థానిక కోదండరామాలయంలో ఈనెల 22న సోమవారం స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి శ్రీరామ పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఈవో సుబ్రమణ్యం నాయుడు, అర్చకులు వేణుగోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అయోధ్య రామాలయ ప్రారంభ సూచకంగా ఆలయంలో స్వామివారికి ఈ సేవలు నిర్వహిస్తున్నట్లు, కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల అనుగ్రహం పొందాలని వారు కోరారు.